సాక్షి
అనకాపల్లి
సోమవారం । 3 । ఏప్రిల్ । 2023



ఇరు వర్గాల కొట్లాట
భూ వివాదం కారణంగా గవరవరంలో ఇరు వర్గాలు కొట్లాటకు దిగాయి. 17 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. 8లో



ఆదర్శవంతమైన సీఎం జగన్
ఇచ్చిన మాటను అమలు చేసి చూపిస్తోన్న జగన్‌మోహనరెడ్డి ఆదర్శవంతమైన సీఎంగా నిలిచారని ఎమ్మెల్యే ధర్మశ్రీ అన్నారు. 8లో



గెస్ట్‌ల పేరిట గోల్‌మాల్ 8లో
విశాఖపట్నం పోర్టు అథారిటీ అక్రమార్జనకు అడ్డాగా మారిపోయింది. ఏం జరుగుతుందో ఆరా తీసేలోపే.. చక్కబెట్టేస్తున్నారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి	
ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6-14	4-35
నర్సీపట్నం	
6-17	4-34

న్యూస్‌రీల్

ఏటికొప్పాక బొమ్మలకు డీఐజీ ఫిదా



ఏటికొప్పాకలో డీఐజీ హరికృష్ణను సన్మానిస్తున్న హస్తకళాకారులు,వైఎస్సార్‌సీపీ నేతలు

యలమంచిలి: అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన ఏటికొప్పాక లక్కబొమ్మలను చూసిన డీఐజీ హరికృష్ణ ఫిదా అయ్యారు. శనివారం రాత్రి సతీసమేతంగా ఆయన ఏటికొప్పాకను సందర్శించారు.హస్తకళాకారుల చేతిలో రూపుదిద్దుకుంటున్న లక్కబొమ్మలను పరిశీలించారు.సహజ సిద్ధమైన రంగులతో వివిధ రకాల బొమ్మలను తయారుచేస్తున్న కళాకారులను ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా డీఐజీని హస్తకళాకారులు, వైఎస్సార్‌సీపీ నేతలు సన్మానించారు. డీఐజీ వెంట అనకాపల్లి ఎస్పీ గౌతమి సాలి, యలమంచిలి సీఐ షేక్ గఫూర్ యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు, జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి భర్త రాము,ఏటికొప్పాక వైఎస్సార్ సీపీ నేతలు దిమిలి రమణబాబు, సతీష్,రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో భారీ వర్షం



మాకవరపాలెంలో కురుస్తున్న భారీ వర్షం

మాకవరపాలెం: మండలంలో ఈదురుగాలలతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం ఉదయం నుంచి తీవ్రంగా ఎండకాయడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలు దాటిన తరువాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురుగాలు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం గంటలకు పైగా కురిసింది. వైర్లపై చెట్ల కొమ్మలుపడి రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలకు ఉపశమనం లభించింది.

హాల్‌టిక్కెట్‌తో ఉచిత బస్సు ప్రయాణం

అనకాపల్లిటౌన్ : పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థుల సౌకర్యార్థం అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి 60 పల్లెవెలుగు బస్సులను నడుపుతున్నట్టు జిల్లా ప్రజా రవాణా(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు వెళ్లేటపుడు, తిరిగి వచ్చేటపుడు విద్యార్థులు ప్రతి పల్లె వెలుగు బస్సులో హాల్‌టిక్కెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ఈ అవకాశం ఈ నెల 3 నుంచి 18వ తేదీ వరకు మాత్రమేనని పేర్కొన్నారు.

దహనం చిత్ర బృందం సందడి



డైరెక్టర్ సాయిని సన్మానిస్తున్న పట్టణ ప్రముఖులు

నర్సీపట్నం: దహనం చిత్ర బృందం ఆదివారం నర్సీపట్నంలో సందడి చేసింది. దహనం సినిమా ప్రదర్శిస్తున్న పీఆర్ సినీ కాంప్లెక్స్‌కు చిత్రం డైరెక్టర్ ఎం.సాయి, విలన్‌గా నటించిన జార్జి చంద్ర వచ్చారు. వారికి వ్యాపారి వెలగా నారాయణరావు, పట్టణ ప్రముఖులు స్వాగతం పలికి, సత్కరించారు. సినిమాను ఆదరించిన ప్రేక్షకులకు చిత్ర బృందం కృతజ్ఞతలు తెలిపింది.

విజయీభవ



పరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

- నేటి నుంచి పదో తరగతి పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ప్రత్యేక తనిఖీ బృందాల నియామకం

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రశాంతంగా, ధైర్యంగా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని నిపుణులు తెలిపారు. పరీక్ష సమయానికి ముందే కేంద్రానికి చేరుకోవాలని, ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని విద్యాశాఖాధికారులు సూచించారు. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరుగనుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 23,913 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో 22,232 మంది రెగ్యులర్, మరో 1681 మంది ప్రైవేటు(వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులున్నారు. పరీక్షల నిర్వహణకు 111 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 111 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 111 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించారు. సిట్టింగ్ స్క్వాడ్‌లు 29, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఐదు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో వసతి, ఫర్నిచర్ సౌకర్యం కల్పించారు. తాగునీటి సౌకర్యంతో పాటు,ప్రతి కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు.ఆదివారం డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్క్వాడ్ అధికారులుజిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించి్, ఏర్పాట్లు పరిశీలించారు.

కేంద్రాల వద్ద సెక్షన్ 144

పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలకు వంద మీటర్లు దూరం వరకు 144వ సెక్షన్ అమలు చేస్తున్నారు. అదే విధంగా జెరాక్స్ సెంటర్లు మూసివేయాలని నోటీసులు ఇచ్చారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందు నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని ఇప్పటికే విద్యాశాఖాధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదు..

పరీక్ష విధులకు నియమితులైన ఉపాధ్యాయులు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు కేంద్రంలో రిపోర్టు చేయాలి. ఈ సారి ప్రశ్న పత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్‌ను ముద్రించారు. ప్రశ్న పత్రం బయటకు వస్తే, అది ఎక్కడ నుంచి వచ్చిందనేది ఈజీగానే గుర్తించే అవకాశం ఉంది. ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయులపై ఈ సారి కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారులు ఇప్పటికే ప్రకటించారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కూడా ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ జరగనున్నాయి. జిల్లాలో 4 ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాల్లో 872 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా 9 ఓపెన్ ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో 1992 మంది హాజరుకానున్నారు.

జిల్లాలో వివరాలు ఇలా ...
- జిల్లాలో 111 పరీక్ష కేంద్రాలు
- 111 మంది చీఫ్ సూపరింటెండెంట్లు
- 111 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు
- జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు- 5
- సిట్టింగ్ స్క్వాడ్‌లు- 29
- సమస్యాత్మక కేంద్రాలు- 5

కంట్రోల్ రూమ్ నంబర్లు
9490462025,
0177292969

పరీక్షల వేళ జాగ్రత్త సుమీ..!
- ఉదయం 8.45 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30 తరువాత అనుమతించరు.
- విద్యార్థులు తమ హాల్‌టికెట్లను తప్పనిసరిగా తీసుకెళ్లాలి.
- పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులు మొబైల్ ఫోన్ ల్యాప్‌టాప్, టాబ్లెట్‌లు, కెమెరాలు, ఇయర్ ఫోన్లు, స్పీకర్లు, స్మార్ట్‌వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలేమీ తీసుకువెళ్లరాదు.
- ఫిజికల్ సైన్స్ కోసం కేటాయించిన 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌లో ఫిజికల్ సైన్స్ జవాబులు రాయాలి. బయాలజికల్ సైన్స్ కోసం అందించబడిన ప్రత్యేక 12 పేజీల ఆన్సర్ బుక్‌లెట్‌లో బయాలజీ సైన్స్ జవాబులు రాయాలి.
- అభ్యర్థులు అత్యవసర పరిస్థితుల్లో మినహా 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల(పరీక్ష సమయం) వరకు పరీక్ష హాలు నుంచి బయటకు వెళ్లడానికి అనుమతించరు.
- 12.45 గంటల లోపు పరీక్ష హాల్ నుంచి ప్రశ్న పత్రం లేదా జవాబు బుక్‌లెట్‌ని తీసుకెళ్లడానికి అనుమతించరు.
- పరీక్ష సమయంలో ఎలాంటి దుర్వినియోగానికి పాల్పడిన అభ్యర్థులు తదుపరి పేపర్లను రాయడానికి అనుమతించరు.
- 'ఓఎంఆర్ బార్ కోడింగ్' అన్ని పేపర్లపై ముద్రించారు. పరీక్ష ప్రారంభానికి ముందు, అభ్యర్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్, పరీక్ష యొక్క వివరాలతో కూడిన ప్రింటెడ్ బార్-కోడెడ్ ఓఎంఆర్ షీటు అందించబడుతుంది. అభ్యర్థి ఓఎంఆర్ షీటుపై ముద్రించిన వివరాలను అతని/ఆమె పేరు, ఫోటో, రోల్ నంబర్ మొదలైన వాటితో పరిశీలించాలి. ఏదైనా తేడా ఉంటే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలి.

ఆదర్శంగా ఏపీ పొదుపు సంఘాలు



దేవరాపల్లిలో మహిళలకు ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- వైఎస్సార్ ఆసరాతో అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: దేశ చరిత్రలోనే మహిళల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పించిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. సీఎం అందిస్తున్న ప్రోత్సాహంతో ఆంధ్రప్రదేశ్‌లోని పొదుపు సంఘాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని ఆయన చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం అట్టహాసంగా జరిగిన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముందుగా వేదికపై మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవరాపల్లి మండలానికి చెందిన 995 పొదుపు సంఘాల్లోని 10,538 మంది సభ్యులకు మూడవ విడత ఆసరా కింద రూ.5,68,96,465 నమూనా చెక్కును అందజేశారు. అనంతరం మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించి జైజగన్, జైజై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు.అనంతరం జరిగిన సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ నాడు డ్వాక్రా రుణ మాఫీ పేరిట చంద్రబాబు మోసం చేయగా, నేడు సీఎం జగన్ వరుసగా మూడో విడత ఆసరా సొమ్మును అందజేసి అండగా నిలిచారన్నారు. మాడుగుల నియోజకవర్గంలోని మైదాన, గిరిజన గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలను పక్కా నాణ్యతా ప్రమాణాలను నిర్మిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో రూ.190 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పథకంలో కుళాయినీరు అందించే పనులు చేపడుతున్నట్టు చెప్పారు. జిల్లా మహిళా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ మాట్లాడుతూ నేను మంచి చేశానని నమ్మితే మాత్రమే ఓటు వేయండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అనంతరం నియోజకవర్గ పరిశీలకుడు ఉరుకుటి అప్పారావు మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును వెలుగు సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళ అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రాకుల గంగాభవానీ, మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్, వైఎస్సార్ క్రాంతిపథం ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి, ఏపీఎం ఎస్. ప్రభాకర్, ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, స్థానిక సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, ఎంపీటీసీ మొల్లి కృష్ణమూర్తి, కార్పొరేషన్ డైరెక్టర్లు డా. వరదపురెడ్డి సింహాచలంనాయుడు, దాడి జగన్, పీఏసీఎస్ అధ్యక్షులు దాసరి గోపి, బండారు ప్రసాద్, చింతు రాము, రెడ్డి అప్పారావు, తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితర్లు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాళ్లు

ఆసరా వేడుకల్లో వివిధ శాఖల అధికార్లు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకట్టుకున్నాయి. వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సందర్శించారు. గర్భిణుల సామూహిక సీమంతాల్లో పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం మండలానికి కేటాయించిన నూతన 104 వాహనాన్ని ఆయన ప్రారంభించారు. చిరుధాన్యాలతో అలంకరించిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



చిరుధాన్యాలతో అలంకరించిన ముగ్గును ఆసక్తిగా చూస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి



కోర్సు పూర్తి చేసిన విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ జిల్లా మేనేజర్ సంతోష్ కుమార్



డిజిటల్ లిటరసీ సర్టిఫికెట్లతో విద్యార్థులు

అనకాపల్లి రూరల్: ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైనా డిజిటల్ అక్షరాస్యులుగా ఉండాలని సీఎస్‌సీ ఈ గవర్నెన్స్ జిల్లా మేనేజర్ సంతోష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ప్రధాన మంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబంలో ఒకరిని డిజిటల్ అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యంగా అమలు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఆదివారం మండలంలోని తుమ్మపాల కామన్ సర్వీస్ సెంటర్‌లో శిక్షణ పొంది, డిజిటల్ అక్షరాస్యత కంప్యూటర్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఆయన ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ అక్షరాస్యత తప్పని సరి అని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఉచితంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. డిజిటల్ అక్షరాస్యతకు అధిక ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలలో ఒకటైన ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ,దారిద్య్ర రేఖకు దిగువన కుటుంబాలు, దివ్యాంగులకు సుమారు 20 గంటల డిజిటల్ శిక్షణ ఉచితంగా అందిస్తున్నటుచెప్పారు.ట్యాబ్లెట్లు,కంప్యూటర్లు,స్మార్ట్‌ఫోన్‌లను ఎలా ఉపయోగించాలో శిక్షణలో నేర్పుతారు. తుమ్మపాలలో ఇప్పటివరకు 130 మంది ఈ కార్యక్రమంలో పేర్లు నమోదు చేసుకోగా,70 మంది పరీక్షలో ఉత్తీర్ణత సాధించారని వారందరికీ ధృవీకరణ పత్రాలు అందజేసినట్టు నిర్వాహకులు తెలిపారు.జిల్లా సమన్వయకర్త కె శివ, కామన్ సర్వీస్ సెంటర్ వీఎల్ఈ వి.వెంకట్ రాము,గణేష్ కోచింగ్ సెంటర్ మాస్టర్ బొడ్డేడ జోగినాయుడు, వలంటీరు అప్పికొండ శ్రావణి పాల్గొన్నారు.

నేత్రపర్వం కల్యాణోత్సవం



అప్పన్న కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

- అప్పన్న కల్యాణోత్సవానికి తరలివచ్చిన భక్తజనం
- ఘనంగా రథోత్సవం

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి కనులపండువగా జరిగింది. అశేషంగా తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని కనులారా తిలకించి పరవశించారు.కల్యాణోత్సవ కార్యక్రమాలను ఆలయ అర్చకులు మధ్యాహ్నం 3 గంటల నుంచి శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద పసుపుకొమ్ములను అర్చకులు, ముత్తయిదువులు దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. అర్చకులు ఆలయ ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమం చేపట్టారు. తరువాత ఎదురుసన్నాహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు రంగు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలోను వేంజేపచేశారు. మాడవీధిలో జోడు భద్రాల వద్ద స్వామివారు, అమ్మవార్ల వైభవాన్ని, గొప్పతనాన్ని చాటిచెబుతూ ఎదురు సన్నాహోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవం రక్తికట్టించారు. వ్యాఖ్యాతలుగా దేవస్థానం స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, టీటీడీ వేదపండితుడు కందుకూరి బాలసుబ్రహ్మణ్యశర్మ వ్యవహరించారు.

హోరెత్తిన రథోత్సవం : ఈ వేడుకల్లో భాగంగా రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు కొబ్బరికాయ కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథసారథిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా, లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా నగరం నలుమూలల నుంచి జాలర్లు.. రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజనసందోహం స్వామివారి రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు. రథంలో ఉన్న స్వామివారిని విశాఖ శ్రీశారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, పంచాడి పద్మ, బయ్యవరపు రాధ దర్శించుకున్నారు.



రథోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి

కనులపండువగా కల్యాణోత్సవం

నృసింహ మండపంలో రాత్రి 9.30 గంటల నుంచి స్వామివారి వార్షిక కల్యాణోత్సవం విశేషంగా జరిగింది. రథోత్సవం అనంతరం రథంలో ఉన్న స్వామివారిని, అమ్మవార్లను నృసింహమండపంలో కల్యాణ వేదికపై వేంజేపచేశారు. జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తరువాత భక్తులకు స్వామివారి ముత్యాల తలంబ్రాలను, ప్రసాదాన్ని అందజేశారు.

ఇస్రో చూసొద్దామా...

- తొమ్మిదో తరగతి విద్యార్థులూ చాన్స్ మిస్సవకండి
- యువికా 2023 రిజిస్ట్రేషన్లకు నేటితో ముగియనున్న గడువు
- ఎంపికైన విద్యార్థులకు రెండు వారాల ప్రత్యేక శిక్షణ
- అంతరిక్ష ప్రయోగాలు ఎలా చేస్తారో స్వయంగా తెలుసుకునే అవకాశం

అనకాపల్లి రూరల్: ఈ విశ్వం నిగూఢ రహస్యాల అనంత నిధి. విశ్వం ఆవిర్భావం..జీవరాశి పుట్టుక..ఎందుకు..ఎలా..అన్న విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం అందిరికీ ఉంటుంది. ఈ విషయాలను ఛేదించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాల శాస్త్రవేత్తలు నిరంతరం అంతరిక్ష పరిశోధనలు చేస్తూ ఉంటారు. వీటిని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి విద్యార్థుల్లో ఎంతగానో ఉంటుంది. విద్యార్థి దశలోనే ప్రతిభ గల వారిని గుర్తించి వారికి అంతరిక్ష సాంకేతికత,పరిజ్ఞానం, అనువర్తనాలపై అవగాహన కల్పించి భావి శాస్త్రవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) కృషి చేస్తోంది. ఇందుకోసం యువికా-2023(యువ విజ్ఞాన కార్యక్రమం-2023) పేరుతో యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం చేపట్టింది. 2023-24 సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు ఈ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. ఇస్రో అధికారిక వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు ఈనెల 3 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) కూడా ఇలాంటి కార్యక్రమమే నిర్వహిస్తోంది. ఇదే తరహాలోనే ఇస్రో దేశంలోని ప్రతిభావంతులైన విద్యార్థులకు వివిధ అంతరిక్ష పరిశోధనా కేంద్రాలను సందర్శించేందుకు అవకాశం కల్పిస్తోంది. అంతరిక్షంలో ఎలా ఉంటుంది, ఉపగ్రహాలు తయారీ,ఉపగ్రహ ప్రయోగాలు ఎలా చేస్తారు, తదితర విషయాలను విద్యార్థులు ప్రత్యక్షంగా తెలుసుకోవచ్చు. నిపుణులతో చర్చలు, సీనియర్ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు.ఈ స్ఫూర్తితో విద్యార్థులు సైన్స్ పట్ల ఆకర్షితులయ్యేందుకు,భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేలా చేయడమే యువికా లక్ష్యం.



ఇస్రో కేంద్రంలో ఉపగ్రహ ప్రయోగం(ఫైల్)

దరఖాస్తు..ఎంపిక విధానం : ఇస్రో ప్రధాన వెబ్‌సైట్‌లో సొంత ఈ మెయిల్ ఐడీతో లాగిన్ అయి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. 8 వతరగతిలో పొందిన మార్కులకు 50 శాతం, ఆన్‌లైన్ క్విజ్‌లో ప్రతిభకు 10 శాతం, సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభకు(జిల్లా/రాష్ట్ర/జాతీయ స్థాయి),క్రీడా పోటీల్లో ప్రతిభకు 2లేదా4లేదా5 శాతం,స్కౌట్స్,గైడ్స్,ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ శిక్షణ పొందితే 5శాతం,గ్రామీణ ప్రాంతాల్లో చదువుతుంటే అదనంగా 15శాతం ఎంపికలో వెయిటేజీ ఇస్తారు.ఎంపికైన వారి మొదటి విడత జాబితా ఈ నెల 10న, రెండో విడత వడపోత తర్వాత జాబితా ఈ నెల20న ప్రకటిస్తారు. వీరంతా అవసరమైన ధ్రువీకరణపత్రాలను అప్‌లోడ్ చేయాలి. పరిశీలన అనంతరం తుది జాబితాను ఇస్రో అధికారులు ప్రకటిస్తారు. వీరంతా ఈ ఏడాది మే 14 లోగా సంబంధిత శిక్షణ కేంద్రాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. యూవికా-2023 ప్రోగ్రాం ఈ ఏడాది మే15 నుంచి 26 వరకు రెండు వారాలు ఉంటుంది.దేశవ్యాప్తంగా 120 మందిని ఎంపిక చేస్తారు. ప్రతీ రాష్ట్రం,కేంద్రపాలిత ప్రాంతం నుంచి ముగ్గురు ఉండేలా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.ఎంపికైన విద్యార్థులకు విక్రమ్ సారాభాయి స్పేస్ సెంటర్ (తిరువనంతపురం),యూ ఆర్ రావు శాటిలైట్ సెంటర్(బెంగళూరు), స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(అహ్మదాబాద్),నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(హైదరాబాద్), నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్(షిల్లాంగ్)లలో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఉంటుంది.విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సైతం కార్యక్రమంలో పాల్గొనడానికి అవకాశం కల్పించారు. శిక్షణ,ప్రయాణ,వసతి,భోజన ఖర్చులన్నింటినీ ఇస్రో భరిస్తుంది. శిక్షణ పూర్తయిన విద్యార్థులకు శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో రాకెట్ ప్రయోగాలపై ప్రాక్టికల్‌గా అవగాహన కల్పిస్తారు.



గతంలో యువికా ప్రోగ్రాంకు ఎంపికైన విద్యార్థులు

245 మంది నమోదు : జిల్లాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు 16,871 మంది ఉండగా ఇప్పటి వరకు 245 మంది నమోదు చేసుకున్నారు.

ముఖ్యమైన తేదీలు

రిజిస్ట్రేషన్ ప్రారంభ తేదీ	:	మార్చి 20
నమోదుకు చివరి తేదీ	:	ఏప్రిల్ 3
తొలి విడత జాబితా	:	ఏప్రిల్ 10
రెండో విడత జాబితా	:	ఏప్రిల్ 20
ఎంపికైన కేంద్రాల్లో రిపోర్టింగ్	:	మే 14
యూవీకా శిక్షణ	:	మే 15-26

చక్కటి అవకాశం



అంతరిక్ష రంగంపై ఆసక్తి కలిగించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుంది. జిల్లాలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలి.ఏ రంగంలోనైనా అవకాశాలను అందిపుచ్చుకునే వారినే విజయం వరిస్తుంది.చిన్న వయసులోనే శాస్త్ర, సాంకేతిక అంశాలు పరిచయమైతే భవిష్యత్తులో మంచి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుంది. ఇస్రో చైర్మన్‌తో సంభాషించే అవకాశం కలుగుతుంది.

– డాక్టర్ కప్పల ప్రసాద్,
జిల్లా సైన్స్ అధికారి,అనకాపల్లి

క్లుప్తంగా

అబ్బురపరిచిన చిన్నారులు



కళ్లకు గంతలు కట్టుకుని చదువుతున్న విద్యార్థులు

నర్సీపట్నం: చిల్డ్రన్ క్లబ్‌లో భాగంగా శాఖా గ్రంథాలయంలో ఆదివారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు కళ్లకు గంతలు కట్టుకుని చదవడంతోపాటు రంగులు పోల్చి అబ్బురపరిచారు. యోగ శిక్షకుడు లాలం రాజుబాబు వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు పి.స్నిగ్ధశ్రీ, ఎ.అరుణకుమార్, ఆర్.కార్తీక్ తమ నైపుణ్యంతో పాఠకులను ఆశ్చర్యానికి గురిచేశారు. వీరంతా యోగ శిక్షణ ద్వారా బ్లెండ్ రీడింగ్ సాధించారని యోగ గురువులు పేర్కొన్నారు. వీరిని గ్రంథాలయ అధికారి పి.దమయంతి అభినందించారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వారికి అర్చకులు ధ్వజస్తంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి శేషవస్త్రాలను, చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఏఈవో రమణమూర్తి అందజేశారు.

దేశంలో ఆదర్శవంతమైన సీఎం జగన్

- హామీల మోసగాడు చంద్రబాబును నమ్మవద్దు
- వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం



రావికమతంలో ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న ధర్మశ్రీ

రావికమతం : మహిళల రుణాలను పూర్తిగా మాఫీ చేసి, బ్యాంకు తాకట్టులో ఉన్న బంగారాన్ని కూడా ఇంటికి తెచ్చిస్తానని హామీ ఇచ్చి, టోపీ పెట్టిన చంద్రబాబుకు, నాలుగు విడతల్లో డ్వాక్రా రుణ మాఫీ చేస్తానని ఇచ్చిన మాటను అమలు చేసి చూపిస్తోన్న జగన్‌మోహనరెడ్డి పాలనను మహిళలు గమనించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. వైఎస్ఆర్ ఆసరా మూడవ విడత పంపిణీ వారోత్సవాలను ఆదివారం రావికమతంలో నిర్వహించారు. డ్వాక్రా మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి చిత్రపటానికి ఘనంగా క్షీరాభిషేకం చేశారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ధర్మశ్రీ మాట్లాడుతూ.. చంద్రబాబు కాలం నాటి డ్వాక్రా రుణాలతోపాటు, అప్పటి ఇంజినీరింగ్ విద్యార్థుల రూ.2 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల్ని కూడా చెల్లించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిగా జగన్ నిలిచారని కొనియాడారు.

ఆసరా మూడు విడతల్లో నియోజకవర్గానికి రూ.150 కోట్లు రాగా రావికమతం మండలంలోని 1,850 గ్రూపుల్లో 15,210 మంది మహిళలకు రూ.35.73 కోట్లు లబ్ధి చేకూరిందని తెలిపారు. మూడో విడత నిధుల నమూనా చెక్కును మహిళలకు అందించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే రాష్ట్రమే అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం జగన్ ఆ దిశగా పాలన సాగించి రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపారని పేర్కొన్నారు. పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచి, టీడీపీ నుంచి ఎన్టీఆర్‌ను వెళ్లగొట్టి, సైకిల్ గుర్తును సైతం లాక్కున్న మోసగాడు చంద్రబాబును నమ్మవద్దని హితవు పలికారు. గంధవరం నుంచి రోలుగుంట మండలం వెలంకాయపాలెం వరకూ బీఎన్ రోడ్డును 60 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు రావికమతం–తోటకూరపాలెం, బీఎన్ రోడ్డు–గుడివాడ, మేడివాడ–కానాడ, మర్రివలస–గొల్లలపాలెం రోడ్లను మూడు నెలల్లో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముక్కా మహాలక్ష్మినాయుడు, జెడ్పీటీసీ భర్త తలారి ఆదిమూర్తి, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, వైస్ఎంపీపీలు దంట్ల వెంకట రమణ, మత్స భవానీప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ఆశరి వాసు గోవిందరావు, చోడవరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజాన నర్సింహులు, మండల మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, రుత్తల బాపునాయుడు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రత్నప్రభ, ఏపీఎం తిలక్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గోవాడ ఫ్యాక్టరీ అభివృద్ధికి మరింత కృషి

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరిన కార్మికులు



ధర్మశ్రీకి సమస్యలు వివరిస్తున్న ఫ్యాక్టరీ కార్మికులు

చోడవరం: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి మరింత కృషిచేయాలని ఫ్యాక్టరీ కార్మికులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరారు. చోడవరంలో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ధర్మశ్రీని ఆదివారం కార్మికులు కలిశారు. ఫ్యాక్టరీ పరిస్థితి ఏటా ఏటా దిగజారిపోతోందని, కార్మికులు, రైతుల పరిస్థితి దయనీయంగా మారే ప్రమాదం పొంచి ఉందని కార్మికులు తమ తెలిపారు. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో సుమారు 23వేలమంది చెరకు రైతులకు, 2వేల మంది కార్మికులకు జీవనాధారంగా ఉన్న గోవాడ సుగర్ ఫ్యాక్టరీని ఆదుకునేందుకు ఫ్యాక్టరీ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కార్మికులు కోరారు. ఈ ఏడాది 2.4లక్షల టన్నుల క్రషింగ్‌తోనే సరిపెట్టుకోవడం వల్ల ఫ్యాక్టరీ ఆర్థికంగా కుదేలయ్యే పరిస్థితి ఏర్పడిందని వారు తెలిపారు. దీనిపై ధర్మశ్రీ స్పందిస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గోవాడ ఫ్యాక్టరీని అన్ని విధాలుగా ఆదుకున్నారని, రానున్న రోజుల్లో కూడా ఆదుకుంటారనే నమ్మకం ఉందన్నారు. అయితే కార్మికులు, రైతులు కూడా ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు తమవంతుగా కృషిచేయాలన్నారు. చెరకు విస్తీర్ణం పెంచడంతోపాటు పండిన చెరకు అంతా ఫ్యాక్టరీ సరఫరా చేసేలా రైతులు,కార్మికులు కృషిచేయాలన్నారు. గతంలో రూ. 100కోట్ల మేరకు ఉన్న అప్పును తీర్చి స్వయం ప్రతిపత్తితో రైతులకు పేమెంట్స్ ఇచ్చేలా గత సీజన్ నుంచే ఆ ప్రక్రియను ఆచరణలోకి తెచ్చామని ధర్మశ్రీ చెప్పారు.

ఈ ఏడాది కూడా తొందరగానే చెరకు పేమెంట్స్ ఇచ్చేలా యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ సహకారంతో ఫ్యాక్టరీని గాడిలో పెట్టేందుకు కృషిచేస్తానని ధర్మశ్రీ చెప్పారు. ఈ సమావేశంలో ఫ్యాక్టరీ గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు కేవీవీ భాస్కరరావు, ఏడువాక నారాయణరావు, రాపేటి జగన్నాథరావు, గొల్లవిల్లి శ్రీను, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

ఇరు వర్గాల కొట్లాట

- భూ వివాదమే కారణం
- రెండు వర్గాలకు చెందిన 17మందిపై కేసులు
- పెప్పర్ స్ప్రే, చాకుతో ప్రత్యర్థులపై దాడి చేసిన ఏఆర్ కానిస్టేబుల్



కత్తితో దాడి చేస్తున్న కానిస్టేబుల్, ఎదుర్కొంటున్న ప్రత్యర్థులు

చోడవరం రూరల్: భూవివాదానికి సంబంధించి సర్వే చేయడానికి వచ్చిన రెవెన్యూ అధికారుల సమక్షంలో ఇరువర్గాలు కొట్లాటకు దిగి, కర్రలు, కత్తులు, పెప్పర్‌స్ప్రే వంటి వాటితో దాడులు చేసుకున్న ఘటన మండలంలోని గవరవరం గ్రామంలో చోటు చేసుకుంది. దీంతో ఇరువర్గాలకు చెందిన 17 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ కొట్లాటలో ఏఆర్ కానిస్టేబుల్ ప్రధాన భూమిక వహించడం విశేషం. పోలీసుల కథనం ప్రకారం గవరవరం రెవెన్యూ గ్రామ పరిధిలో జి.జగన్నాథపురం గ్రామానికి వెళ్లే రోడ్డులో ఖండిగాతగా పేర్కొనే వ్యవసాయ భూముల వద్ద గ్రామ సర్పంచ్ చప్పగడ్డి మాణిక్యం కుమార్తె జొన్నపల్లి చినతల్లి చెందిన భూమిలో ఏఆర్ కానిస్టేబుల్ వంకల అప్పలనాయుడు ఉరఫ్ నానాజీ ఫెన్సింగ్ వేశాడన్న ఫిర్యాదుపై రీ సర్వే నిమిత్తం శనివారం తహసీల్దార్ తిరుమలబాబు, వీఆర్‌వో రమణమూర్తి ఆ భూమి వద్దకు వెళ్లారు. భూ వివరాలు అడుగుతున్న సమయంలో ఏఆర్ కానిస్టేబుల్ అప్పలనాయుడు కలగజేసుకోవడం ఇరు వర్గాల మధ్య కొట్లాటకు దారి తీసింది. పొలంలో ఒక వర్గం కర్రలతో దాడికి దిగగా మరో వర్గంలోని కానిస్టేబుల్ పెప్పర్ స్ప్రే జల్లి, చాకుతో అందినవారినల్లా పొడిచాడు. ఈ దాడుల్లో ఇరువర్గాల వారు గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. గొడవ రోడ్డుకు పల్లంగాఉన్న భూమిలో జరగడంతో తహసీల్దార్ ఏమీ చేయలేని స్థితిలో ఉండి పోయారు. ఇరు వర్గాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు 17 మందిపై కేసులునమోదు చేసినట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. చప్పగడ్డి దేముడునాయుడు ఫిర్యాదు మేరకు వంకల అప్పలనాయుడు, ఉప్పుల అప్పారావుతోపాటు మరో ముగ్గురిపై, వంకల అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు చప్పగడ్డి అర్జున్, అప్పలనాయుడు, దేవుళ్లనాయుడు, జొన్నపల్లి వెంకటరమణ, దేవుడునాయుడుల తోపాటు మరో ఏడుగురిపైనా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.గాయపడిన వారు చోడవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు.

అగ్నిప్రమాదంలో మూగజీవాలు మృతి



అగ్ని ప్రమాదంలో దగ్ధమైన గడ్డిమేటలు



అగ్ని ప్రమాదంలో గాయపడిన ఆవు

కోటవురట్ల : అగ్ని ప్రమాదంలో రెండు మూగజీవాలు మృతి చెందగా మరో మూడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. తంగేడు గ్రామానికి చెందిన శింగంపల్లి శ్రీను అనే రైతు పొలంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువుల పాకలు, రెండు గడ్డి మేటులు పూర్తి కాలిపోయాయి. ఈ ప్రమాదంలో ఒక గొర్రె, ఆవు పెయ్య మంటలకు తీవ్రంగా గాయపడి మృతి చెందాయి. మరో మూడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. స్థానిక రైతులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ప్రమాదం ఎలా జరిగిందో తెలియదని రైతు శ్రీను ఆవేదనగా తెలిపాడు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించినట్టు తెలిపాడు. రెవెన్యూ అధికారులు ప్రమాద వివరాలు నమోదు చేశారు.

పదేళ్లకే నూరేళ్లు నిండాయి...

- రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి
- ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఘోరం



ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ప్రమాదంలో మృతి చెందిన చంద్రశేఖర్

మాడుగుల రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పదేళ్ల వయస్సు కలిగిన పాఠశాల విద్యార్థి ముచ్చల చంద్రశేఖర్ (10) ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో మృతి చెందిన ఘటన ఆలస్యంగా తెలియవచ్చింది. స్థానిక ఎస్‌ఐ పి. దామోదర్‌నాయుడు కథనం ప్రకారం సాగరం పంచాయతీ సురవరం గ్రామానికి చెందిన ముచ్చల చంద్రశేఖర్ తన తల్లిదండ్రులు నరేష్, నాగమణితో కలిసి శనివారం అనకాపల్లి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో శనివారం రాత్రి పది గంటల సమయంలో ఘాట్‌రోడ్డు జంక్షన్ సమీపంలో తాము వస్తున్న ఆటో దిగారు. వీరు జంక్షన్ సమీపంలో కిరణా షాపు వద్దకు వెళ్లి, తిరిగి రోడ్డు దాటుతూ ఆటో వద్దకు వస్తుండగా పాడేరు నుంచి ఘాట్‌రోడ్డు వైపు వస్తున్న బొలేరో వాహనం బలంగా ఢీకొట్టి పరారైంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఎస్‌ఐ దామోదర్ నాయుడు సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. పరారైన వాహనం కోసం గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నర్సీపట్నం : పట్టణంలో పాత సంతబయలకు చెందిన పి.ఈశ్వరరావు(50) మద్యానికి బానిసై ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని టౌన్ ఎస్‌ఐ గోవిందరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి. మృతుడు ఏజెన్సీ వ్యాపారం చేస్తూ, పాత సంతబయలలోని అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం మద్యం సేవించి వచ్చి ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు.. ఇది గమనించి భార్య కేకలు వేయడంతో స్థానికులు వచ్చి తలుపులు కొట్టినా తియ్యకపోవడంతో, గడియ విరగ్గొట్టి తలుపు తీసేసరికి ఈశ్వరరావు చనిపోయి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మహిళపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

గొలుగొండ : పాకలపాడు గ్రామంలో భూ వివాదంలో మూకల సూర్యనారాయణమ్మపై దౌర్జన్యం చేసిన వ్యక్తిపై గొలుగొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన అల్లు వెంకట రమణ అనే వ్యక్తికి మూకల సూర్యనారాయణమ్మ మధ్య భూ సమస్యలు ఉన్నాయి. శనివారం సాయంత్రం వెంకట రమణ సూర్యనారాయణమ్మపై దౌర్జన్యం చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆమె నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతోంది. దీనిపై గొలుగొండ పోలీసులు శనివారం రాత్రి పది గంటల సమయంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు.

నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తజనం



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు



నూకాంబిక అమ్మవారు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కొత్త అమావాస్య జాతరలో భాగంగా రెండో ఆదివారం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. కొంతమంది భక్తులు తమ గృహాల వద్ద శనివారం రాత్రి అమ్మవారి పాట నిర్వహించి, కాలినడకన ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో వంటకాలు చేసి అమ్మవారికి నివేదించారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ రద్దీతో నిండి ఆలయ రహదారిపై భక్తులు బారులు తీరారు. డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత, ఆలయ ఈవో బండారు ప్రసాద్, పట్టణ సీఐ దాడి మోహనరావులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గెస్ట్‌ల పేరిట గోల్‌మాల్

- పోర్టులో అతిథుల పేరుతో రూ.7 కోట్లకు పైగా కొల్లగొట్టిన వైనం
- ఏడాదిన్నర కాలంలో 600 మంది అతిథులొచ్చినట్లు రికార్డులు
- అనధికార ఖర్చులను కార్యక్రమాల బిల్లులంటూ డ్రా చేసిన అధికారి
- పరిపాలన విభాగం ఉన్నతాధికారి తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- పట్టించుకోని విజిలెన్స్ విభాగం.. ఢిల్లీలో ఫిర్యాదు చేసిన ఉద్యోగులు

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం పోర్టు అథారిటీ అక్రమార్జనకు కామధేనువులా మారిపోయింది. సెంట్రల్ ఆధీనంలో నడిచే పోర్టులో ఏం జరుగుతుందో ఆరా తీసేలోపే.. వ్యవహారాన్ని చక్కబెట్టేస్తున్నారు. అతిథుల పేరుతో రూ.7 కోట్లకు పైగా ఖజానాకు కన్నం పెట్టేశారు. దీని వెనుక కీలక అధికారి ముఖ్య భూమిక వహించగా.. జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో ఉన్న ఓ ఉన్నతాధికారి చక్రం తిప్పారు. వివరాల్లోకి వెళ్తే.. పోర్టు సందర్శనకు, ఇందులో జరిగే కార్యక్రమాలకు హాజరయ్యేందుకు వచ్చే అతిథులకు కొంతమేర బిల్లులు కేటాయిస్తారు. సాధారణంగా వచ్చే అతిథికి ఒక వాహనం, భోజన సౌకర్యం, పోర్టు గెస్ట్ హౌస్‌లో ఓ గదిని కేటాయించడమనేది సాధారణ ప్రోటోకాల్‌లో ఓ భాగం. కానీ.. గత ఏడాదిన్నర కాలంగా దీనికి పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఈ సమయంలో సుమారు 600 మంది వరకు గెస్ట్‌లు వచ్చినట్లు పోర్టు రికార్డులు చెబుతున్నాయి. వీరిలో సింహభాగం అతిథులకు పోర్టు గెస్ట్ హౌస్‌లో కాకుండా బీచ్‌రోడ్డులో ఉన్న ప్రముఖ స్టార్ హోటల్‌లో వసతి, ఇతర సౌకర్యాలు కల్పించారు. ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకూ బిల్లు అయ్యేది. అయితే.. సదరు గెస్ట్ ఎవరి తరఫున వస్తే.. వారి అకౌంట్ నుంచే బిల్లులు జమ చేస్తారు. కానీ.. ఇలా ఈ ఏడాదిన్నర కాలంలో వచ్చిన గెస్ట్‌లకు ఏ అకౌంట్‌లో బిల్లులు చెల్లించారన్నది మాత్రం ఎక్కడా కనిపించకుండా చేసేశారు. వీటి మొత్తం దాదాపు రూ.5 కోట్ల పైమాటేనని అధికారికంగా లెక్కతేల్చినట్లు తెలుస్తోంది.

బిల్లు ప్రైవేట్.. చెల్లింపు పబ్లిక్..!

వివిధ వర్గాల ప్రతినిధులతో భేటీ అయ్యేందుకు పోర్టు ఉన్నతాధికారులు విజయవాడ వెళ్తుంటారు. అక్కడికి వెళ్తే.. వారి బస, రవాణా, వసతి వరకూ మాత్రమే పోర్టు భరిస్తుంది. కానీ.. సదరు ఉన్నతాధికారులు విజయవాడలో కాక్‌టైల్ డిన్నర్‌పార్టీలు నిర్వహించేవారు. వాటి బిల్లుల్ని విశాఖలో ఉన్న హోటల్ పేరుతో తీసుకునేవారని తెలుస్తోంది. అదేవిధంగా.. పోర్టుకు సంబంధించిన టగ్‌లలో ఎలాంటి అనుమతులు లేకుండా నైట్ పార్టీలు నిర్వహించేవారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక టగ్ నడపాలంటే గంటకు దాదాపు రూ.లక్ష వరకూ ఇంధనం ఖర్చవుతుంది. ఈ పార్టీలు తెల్లవార్లు వరకు జరిగేవనీ.. దీనివల్ల పార్టీ జరిగిన రోజున దాదాపు రూ.5 నుంచి రూ.10 లక్షల వరకూ డీజిల్ ఖర్చయ్యేదనీ.. వీటిని కూడా పోర్టు కార్యకలాపాల్లో భాగంగా టగ్‌లు నడిపినట్లు సాధారణ వ్యవహారాల రికార్డుల్లో తారుమారు చేసేసేవారని పోర్టు వర్గాలు చెబుతున్నాయి. ఇలా గెస్ట్‌ల బిల్లులు, ఈ తరహా అనధికారిక ప్రైవేట్ పార్టీల బిల్లులను అధికారిక కార్యకలాపాల్లో కలిపేసి జమ చేసుకునేవారని సమాచారం.

అంతా.. ఆయన కనుసన్నల్లోనే!

పోర్టు ఉన్నతాధికారి చేసిన విచ్చలవిడి దుబారా ఖర్చును సక్రమ బిల్లుల్లోకి సర్దుబాటు చేసే పనిని సాధారణ పరిపాలన విభాగంలోని ముఖ్య అధికారి నిర్వర్తించేవారు. ఏ అడ్డగోలు బిల్లు వచ్చినా దాన్ని తదుపరి పోర్టు అధికారిక కార్యక్రమం వచ్చేంత వరకూ వాటిని గోప్యంగా ఉంచేవారు. ఈలోగా తనకు సంబంధించి కూడా.. కొన్ని బిల్లుల్ని ఉన్నతాధికారి ఖాతాలో కలిపేసేవారు. పోర్టుకు సంబంధించి ఏవైనా కార్యక్రమాలు జరిగినప్పుడు ఈ అనధికార బిల్లులకు రెక్కలొచ్చేవి. వాటన్నింటినీ అధికారిక ఖాతాలో జమ చేసేసి.. తన జేబుని జీఏడీ అధికారి నింపేసుకునేవారు. ఇలా.. ఈయన కూడా రూ.2 నుంచి రూ.3 కోట్ల వరకూ అనధికార బిల్లుల్ని కొల్లగొట్టారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

సెంట్రల్ విజిలెన్స్‌కు ఫిర్యాదు

పోర్టులో జరుగుతున్న అనధికార వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తుండటంతో.. సాధారణ పరిపాలన విభాగంలోని అధికారి తలలు పట్టుకుంటున్నారు. ఈ వ్యవహారాలన్నింటిపై పోర్టులో ఉన్న విజిలెన్స్ విభాగానికి ఒకట్రెండు సార్లు కొందరు ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. అయినా ఆ ఫిర్యాదులపై కనీస విచారణ చేపట్టకుండా.. ఏం జరుగుతుందన్న విషయాన్ని కూడా పట్టించుకోలేదని తెలుస్తోంది. దీంతో ఇక్కడ పనిచేసే కొందరు ఉద్యోగులు, అధికారులు.. పోర్టులో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలకు సంబంధించి పూర్తి ఆధారాలతో రెండు రోజుల క్రితం ఢిల్లీలో ఉన్న కేంద్ర షిప్పింగ్, పోర్టుల మంత్రిత్వ శాఖ సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. స్థానిక హోటల్‌లో పోర్టు తరఫున ఉన్న బిల్లులు, వాటిని క్లెయిమ్ చేసుకునేందుకు అధికారి చేసిన అడ్డగోలు ఫైళ్లను పరిశీలిస్తే.. మొత్తం వ్యవహారం బట్టబయలవుతుందని పోర్టు ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి.

క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



వెలంపేటలో చేపట్టిన సిమెంట్ రోడ్ నిర్మాణ పనులు

కశింకోట : స్థానిక వెలంపేటలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ఆదివారం చేపట్టారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మంజూరు చేసిన రూ. 10 లక్షలతో రోడ్డు పనులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు పనులను పరిశీలించారు.

ఘనంగా మట్టల ఆదివారం



మట్టల ఆదివారం కార్యక్రమంలో క్రైస్తవులు

కశింకోట: మండలంలోని జి.భీమవరం శివారు సింగవరం గ్రామంలో మట్టల ఆదివారం పురస్కరించుకుని క్రైస్తవులు పాదయాత్ర నిర్వహించారు. జీసస్ మిరాకిల్ చర్చి నుంచి పాస్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో పూలతో అలంకరించిన ఈత మట్టలను చేతబూని ఏసుక్రీస్తును కీర్తిస్తూ అచ్చెర్ల గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించి, మళ్లీ చర్చికి చేరుకున్నారు.

ఆదర్శనీయుడు మళ్ల వెంకటరమణ

అనకాపల్లిటౌన్ : స్వర్గీయ మళ్ల వెంకటరమణ సేవా నిరతిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. స్థానిక గవరపాలెం పెదరామస్వామి ఆలయంలో రమణ జ్ఞాపకార్థం ఆయన మనుమలు దివాకర్, మానస ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సుగర్, బీపీ రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజన



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎస్సై మహమ్మద్‌అలీ

తుమ్మపాల : వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుతుందని పట్టణ ఎస్సై మహమ్మద్ అలీ అన్నారు. పట్టణంలోని జేఎంజే ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆదివారం సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన సైన్స్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఉన్న జ్ఞానాన్ని వెలికితీసేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ నక్షత్రం, ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	షిర్డిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 102 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-38 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-52 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 254 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 195 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

భవిత 'పది'లం



కొత్తూరు ఏఎంఏఏ ఎయిడెడ్ స్కూల్ పరీక్ష కేంద్రం

- నేటి నుంచి టెన్త్ పరీక్షలు
- పరీక్షా కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు
- మండలంలో 13 సెంటర్లు, 3,124 మంది విద్యార్థులు

అనకాపల్లి రూరల్ : నేటి నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యాశాఖాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎక్కడా చిన్నపాటి సమస్య కూడా తలెత్తకూడదని మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి ముందస్తు చర్యలు తీసుకున్నారు.

సర్వం సన్నద్ధం

పోలీస్ స్టేషన్, ఖజానా కార్యాలయాలకు 8 కిలోమీటర్ల లోపున్న పరీక్షా కేంద్రాలను ఏ, బీగా, అంతకంటే ఎక్కువ దూరంలో ఉన్న కేంద్రాలను సీ కేటగిరీగా విభజించారు. సీ కేంద్రాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే సీఎస్, డీవో, ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయింది. పరీక్షల నిర్వహణపై శనివారం అన్ని కేంద్రాల సీఎస్, డీవోలు ఇన్విజిలేటర్లతో సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి కేంద్రంలో కనీసం ఇద్దరు మహిళా ఇన్విజిలేటర్లు ఉండేలా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, టేబుల్స్, టాయిలెట్లు సిద్ధంగా ఉంచారు. అవసరమైతే విద్యార్థులకు ప్రాథమిక వైద్యం అందించేందుకు ఆరోగ్య సిబ్బందిని నియమించారు. ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు.

13 కేంద్రాలు.. 3124 మంది విద్యార్థులు

పది పరీక్షల కోసం అనకాపల్లి మండలంలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఐదు ప్రైవేటు, 7 ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లు ఉన్నాయి. అనకాపల్లి పట్టణంలో శ్రీ చైతన్య, నారాయణ, భాష్యం, సంయుక్త, జేఎంజే, గాంధీనగరం, గవరపాలెం, బాలికల జీవీఎంసీ హైస్కూళ్లు, కూండ్రం, తుమ్మపాల, మామిడిపాలెం, కొండకొప్పాక జిల్లా పరిషత్ హైస్కూళ్లు, కొత్తూరు ఏఎంఏఏ ఎయిడెడ్ స్కూళ్లలో మొత్తం 3,124 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. గతంలో మాదిరిగా 11 ప్రశ్నపత్రాలు ఉండవు. ఈ ఏడాది ప్రభుత్వం వాటిని ఆరుకు కుదించింది. సైన్సుకు సంబంధించి బయాలజీ, ఫిజికల్ సైన్స్ పరీక్షలకు వేర్వేరు బుక్‌లెట్లు ఇస్తారు. మాల్ ప్రాక్టీస్‌కు తావులేకుండా జవాబు పత్రంపై వరుస సంఖ్య ఉంటుంది.

నిషేధాజ్ఞలు ఇలా..

అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో సెక్షన్ 144 అమలు చేస్తున్నారు. ఆ పరిధిలో జిరాక్స్ సెంటర్లు లేకుండా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది వద్ద కూడా స్మార్ట్ ఫోన్లు ఉండవు. పరీక్షలు రోజూ ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు జరుగుతాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రంలో ఉండాలి. పోలీసుల నిఘా మధ్య ప్రశ్నాపత్రాలు తీసుకొచ్చి వారి పర్యవేక్షణలోనే జవాబు పత్రాలు తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

పటిష్ట ఏర్పాట్లు



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేశాం. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం. ఆరోగ్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాం. పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగా వచ్చి విద్యార్థులు తమకు కేటాయించిన గదులను చూసుకోవాలి. విద్యార్థులు ఆందోళన చెందకుండా తమకు బాగా వచ్చిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలి. ప్రశాంత మనసుతో ధైర్యంగా పరీక్షలు రాస్తే చాలు.. ఉత్తమ ఫలితాలు వస్తాయి.

– బి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి

నూకాంబిక ఈవోకు అభినందన



ఆలయ ఈవో ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన బండారు ప్రసాద్‌ను ఆదివారం ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు కలిసి, పుష్పగుచ్ఛం అందించి అభినందించాయి. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేతలు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ ఆలయాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి గైపూరి రాజు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వేగి త్రినాథ్, పార్టీ నేతలు ఆడారి శ్రీనివాసరావు, దొడ్డి హరి పాల్గొన్నారు.

మంచి స్నేహితుడులాంటిది పుస్తకం



టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందిస్తున్న హిందీ అధ్యాపకుడు మహమ్మద్ అలీ

తుమ్మపాల : పట్టణంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పుస్తకం విద్యార్థులకు మాత్రమే కాకుండా జీవితంలో ప్రతి వ్యక్తికి మంచి స్నేహితుడిలాంటిదన్నారు. గురుకుల గ్రంథాలయాల్లో ఉన్న అనేక పుస్తకాలను విద్యార్థులు చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. పాఠశాల చైర్మన్ కర్రి గంగధర్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. హిందీ అధ్యాపకుడు మహేంద్రపట్నాయక్ పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు.

దంచికొట్టిన వాన

కశింకోట : మండలంలోని జి.భీమవరం గ్రామంలో ఆదివారం ఆకస్మికంగా పెద్ద వర్షం కురిసింది. గాలి లేకుండా సుమారు గంట పాటు వర్షం పడింది. దీంతో కాలువల్లోని మురుగునీరు, చెత్తా చెదారం రోడ్లపైకి చేరుకుంది. వాతావరణం చల్లబడి స్థానికులు ఉపశమనం చెందారు. ప్రస్తుతం ఈ వర్షం వల్ల ప్రయోజనం లేకపోయినా పూత దశలో ఉన్న మామిడి, జీడిమామిడి పంటలకు నష్టం కలిగిస్తుందని రైతులు తెలిపారు. కశింకోటలో ఆకాశం మేఘావృతం అయినప్పటి చిరు జల్లులకే పరిమితమైంది.

చలివేంద్రాలు ప్రారంభం



తోటాడ హైవే సమీపంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్



నెహ్రూచౌక్ బస్‌స్టాండ్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆళ్ల ప్రవీణ్‌కుమార్

అనకాపల్లిటౌన్ : వేసవి దృష్ట్యా ప్రజల దహార్తిని తీర్చేందుకు యువత చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ రహదారిలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

తోటాడ జంక్షన్ వద్ద..

స్థానిక జాతీయ రహదారి తోటాడ గ్రామానికి వెళ్లే దారిలో శ్రీ వీరాంజనేయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని దాడి రత్నాకర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆర్థిక సాయంతో దీన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు.

నెహ్రూచౌక్‌లో..

స్థానిక నెహ్రూచౌక్ ఆర్టీసీ బస్‌స్టాప్ వద్ద అబ్దుల్ కలాం సేవా సంఘం చైర్మన్ ఆళ్ల ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్ నుంచి విశాఖ, గాజువాక, విజయనగరం, శ్రీకాకుళం రాకపోకలు సాగించేవారి కోసం దీన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొణతాల హరనాథ్‌బాబు పాల్గొన్నారు.

కమనీయం నృసింహుని కల్యాణం

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం దిబ్బవీధి వరాహలక్ష్మీనృసింహస్వామి తిరువీధి, కల్యాణోత్సవం ఆదివారం కమనీయంగా జరిగింది. ఈ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, అచ్యుత దంపతుల చేతుల మీదుగా జరిగాయి. సుమారు 30 జంటలు కల్యాణోత్సవంలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ, భాస్కర్, పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో 1972-73 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



పడమటమ్మలోవలో 1984-85 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అనకాపల్లిటౌన్ : వారి స్నేహానికి వయసు 23 ఏళ్లకు పైనే. 1984-85 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు. స్థానిక గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్లో చదువుకున్నారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో జీవనోపాధి కొనసాగిస్తున్నారు. వారంతా తుని పడమటమ్మలోవలో ఆదివారం కలుసుకున్నారు. ఒకరినొకరు గుర్తుపట్టేందుకే కాస్త సమయం పట్టింది తప్ప, ఆ తర్వాత వారి అల్లరికి అంతే లేకుండా పోయింది. ఏళ్ల తరబడి పదిలంగా దాచుకున్న కబుర్లన్నీ చెప్పుకున్నారు. అప్పటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకుని పడీపడీ నవ్వుకున్నారు. కుటుంబం గురించి, పిల్లల గురించి మాట్లాడుకుని మనసారా ఆనందించారు. అంతకు ముందు అమ్మవారిని దర్శించుకుని ప్రతీ ఏటా ఇలాగే అందరూ కలుసుకోవాలని పడమటమ్మకు మొక్కుకున్నారు. పేదలకు తమ వంతు సహాయం అందిస్తూ, విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా తలా కొంత నగదును తీసి, ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారు. సహపంక్తి భోజనాలు చేసి, సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పీవీ రమణ, నాగేశ్వరరావు, అరవింద్, సన్నా అప్పారావు, మల్లికార్జునరావు, డిస్కో నాయుడు, భానుప్రకాష్, పెంటకోట చిన్న, రమణ బాబు, రంగా, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఏఏ స్కూల్ టెన్త్ బ్యాచ్ : స్థానిక వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ ఫంక్షన్ హాల్లో ఏఎంఏఏ హైస్కూల్ 1972-73 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల స్వర్ణోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పిల్లలు ఎక్కడెక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు రూ.2.30 లక్షల విలువైన ఫర్నిచర్‌ను అందించారు. గురువుల్ని సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాండురంగ గురునాథరావు, వెంకట సత్యనారాయణ, రామకృష్ణ, సుధాకర్, శంకరనారాయణ పాల్గొన్నారు.

పశు వైద్యశాలలకు వీడని గ్రహణం

- ఒకటిన్నర దశాబ్దంగా ఇరుకు గదిలోనే నిర్వహణ
- వైద్యులున్నా.. వైద్యసేవలు మాత్రం అరకొరే
- నిర్మాణంలోనే నర్సింగబిల్లి పశు వైద్య కేంద్రం



ఏళ్ల తరబడి పనులు పూర్తికాక అసంపూర్తిగా ఉన్న పశు వైద్యశాల భవనం



సామాజిక భవనంలో నడుస్తున్న పశు వైద్యశాల

కశింకోట : మండలంలోని నరసింగబిల్లి ఉన్న గ్రామీణ పశు వైద్యశాలకు గ్రహణం వీడట్లేదు. ఒకటిన్నర దశాబ్దం క్రితం చేపట్టిన నిర్మాణం పూర్తికాకపోవడంతో.. ఇరుకైన సామాజిక భవనంలో వైద్యసేవలు కొనసాగించాల్సి వస్తోంది. సిబ్బంది ఉన్నా సరైన వసతులు లేక పశువులకు పూర్తి స్థాయిలో వైద్యం అందట్లేదని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

15 ఏళ్లుగా నిర్మాణంలోనే..

జాతీయ రహదారి పక్కన పీఏసీఎస్ సమీపంలో ఉన్న ఓ భవనంలో 1999 నుంచి స్థానిక పశువైద్య కేంద్రాన్ని నిర్వహించేవారు. నరసింగబిల్లి పరిసర ప్రాంతాల్లో పాడి సంపద ఎక్కువ. దీంతో పశువులకు అనారోగ్యం వచ్చినా, చూడికట్టడానికి, ఏలికపాముల నివారణ తదితర సమస్యలపై ఈ ఆస్పత్రే దిక్కు. భవనం శిథిలావస్థకు చేరడంతో రజక కాలనీ వద్ద 2007లో రూ.7 లక్షల నిధులతో ప్రత్యేక భవన నిర్మాణాన్ని చేపట్టారు. నిధుల లేమితో అది అసంపూర్తిగా నిలిచిపోయింది. హుద్‌హుద్ తుపాను సమయంలో రూ.5 లక్షలు కేటాయించినా, నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ మళ్లీ మధ్యలోనే చేతులెత్తేశారు. ఐదేళ్ల క్రితం పశు వైద్య కేంద్ర పాత భవనం ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో అద్దెకు భవనం లభ్యం కాకపోవడంతో మూడేళ్ల క్రితం పబ్లిక్ స్టేజ్ పక్కనున్న సామాజిక భవనంలోకి ఆస్పత్రిని తరలించారు. ఇప్పటికీ ఇక్కడే వైద్యం అందిస్తున్నారు.

ముగ్గురిలో ఒకరు పదోన్నతిపై బదిలీ

ప్రస్తుతం ఈ ఆస్పత్రిలో ఒక వైద్యురాలు, మరో పశుసంవర్ధక శాఖ సహాయకురాలు సేవలందిస్తున్నారు. వెటర్నరీ అసిస్టెంట్ కూడా ఉండేవారు. ఏడాది క్రితం పదోన్నతిపై వెళ్లి పోయారు. దీంతో ఆ పోస్టు మాత్రం ఖాళీగా ఉంది. అయితే వైద్యులు ఉన్నప్పటికీ సరిపడా స్థలం లేక పశువులను తనిఖీ చేయడానికి వీల్లేని పరిస్థితి. దీంతో వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి సేవలందించాల్సి వస్తోంది. అత్యవసర సమయంలో సరైన సదుపాయాలు లేక ప్రైవేటు వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోందని స్థానిక రైతులు వాపోతున్నారు. రోజుకు సుమారు 30 మంది పాడి రైతులు తమ పశువుల్ని తీసుకుని వైద్యం కోసం ఇక్కడికి వస్తుంటారు. అసంపూర్తి భవనాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పూర్తిస్థాయి వైద్య సేవలందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పాడి రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ వైద్యం భారం



సరైన భవనం లేక పశు వైద్య కేంద్రం ఇరుకైన సామాజిక భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన సదుపాయాలు లేవు. దీంతో ప్రైవేటు వైద్యులను ఆశ్రయించక తప్పట్లేదు. ఇందుకు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. సరైన వైద్యం అందక కొన్ని పశువులు మృత్యువాత పడి, నష్టం వాటిల్లుతోంది. భవనాన్ని పూర్తి చేసి, మెరుగైన వైద్యం అందించాలి.

– కశిరెడ్డి మాణిక్యాలరావు, పాడి రైతు, నరసింగబిల్లి

పురుష సిబ్బందిని నియమించాలి



మూడు ఆవులను మేపుతున్నాం. పుష్కర కాలంగా ఈ ఆస్పత్రిలో పశువులకు సరైన వైద్య సేవలందట్లేదు. ఉన్న ఇద్దరూ మహిళా వైద్యులు కావడంతో పశువుల్ని లొంగదీసుకుని వైద్యం అందించడం కష్టంగా ఉంది. పశువులకు సేవలందించడానికి ఒక పురుష సిబ్బందిని కూడా ఇక్కడ అందుబాటులో ఉంచాలి.

– భీముని అప్పలనాయుడు, పాడి రైతు, జెట్టపురెడ్డితుని

కలెక్టర్‌కు నివేదించాం

పశువైద్య కేంద్రం భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. దీన్ని పూర్తి చేసేందుకు నిధుల కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఆయన చెప్పారు. నిధులు మంజూరైన వెంటనే పనులు పూర్తి చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు.

– చైతన్యమణి, పశు వైద్యాధికారి, నరసింగబిల్లి

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

- ఆశీలు పెంపునకు నిరసనగా నేడు దుకాణాల మూత



కూరగాయల మార్కెట్లో చిల్లర వర్తకుల ఆందోళన

అనకాపల్లి రూరల్ : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్లో చిల్లర వర్తకులతో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాల కారణంగా బడుగు వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఇటీవల మృతి చెందిన కౌలు రైతు సంఘం సభ్యురాలు సూరిశెట్టి అప్పలనర్సకు నివాళులర్పించిన అనంతరం కూలీలు, చిల్లర వర్తకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పన్నుల మోతకు తోడు మార్కెట్లో ఆశీలు రుసుము పెంపును నిరసిస్తూ సోమవారం కూరగాయల మార్కెట్ బంద్ చేపట్టనున్నట్టు ప్రకటించారు. మార్కెట్లో కనీస సౌకర్యాలు కల్పించాలని వారంతా డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి-అచ్యుతాపురం రహదారి నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి పరి కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా రహదారి గోతులమయంగా మారడంతో అటుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు బొడ్డు రాజేష్, కార్యదర్శి మంత్రి శివ, సమితి రాష్ట్ర సభ్యులు జి.మహేష్, జి.మమత పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాల్లో ఎన్టీపీసీ సేవలు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో నిర్వాసిత గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి వారికి అండగా నిలుస్తోంది. ముఖ్యంగా తాగునీరు, విద్య, వైద్యం, డ్రైనేజీలు, కమ్యూనిటీ టాయిలెట్లు, సీసీ రహదారులు, వాటర్ ట్యాంకులు, వాటర్ ప్లాంట్లు, వైద్య ఆరోగ్య శిబిరాలు, మొబైల్ హెల్త్ యూనిట్లు వంటి సదుపాయాలు కల్పించింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందజేస్తుంది. పీహెచ్‌సీలను ఆధునికీకరించి రోగులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించింది. సింహాద్రి నిర్వాసిత గ్రామాలను సీఎస్సార్ నిధుల ద్వారా అభివృద్ధి చేయడానికి సంస్థ కట్టుబడి ఉందని జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పేర్కొన్నారు.

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

- డ్వామా పీడీ సందీప్



సర్వే రాళ్లు పాతుతున్న కూలీలకు సూచనలిస్తున్న పీడీ సందీప్

సబ్బవరం : సమగ్ర భూ రీ సర్వేతో గ్రామాల్లో భూ వివాదాలకు చెక్ పడతాయని డ్వామా పీడీ సందీప్ అన్నారు. మండలంలోని రాయపుర అగ్రహారంలో సమగ్ర రీ సర్వేలో భాగంగా చేపట్టిన హద్దు రాళ్ల పాతే కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని ఈ సర్వే చేపట్టిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన కొలతలతో సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామ భౌగోళిక పరిస్థితులతో పాటు సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ప్లాంటేషన్ కార్యక్రమాన్ని పూర్తిచేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లల అప్పలనాయుడు, మండల సర్వేయర్ కె.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసరావు, వీఆర్వో అప్పారావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పం అమలుకు కృషి

మునగపాక : జగనన్న స్వచ్ఛ సంకల్పం శత శాతం అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న సంపద తయారీ కేంద్రాన్ని ఆయన ఆదివారం పరిశీలించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా గ్రామాలు అభివృద్ధి పథంలో పరుగులు తీస్తున్నాయని తెలిపారు.